**ప్రజల మాట ప్రగతి బాట**

**కరీంనగర్ నియోజకవర్గం**



పద్మనాయక కల్యాణ మండపంలో ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన మంత్రి గంగుల కమలాకర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆయా సంఘాల నాయకులు



కొత్తపల్లి మండలం బద్దిపల్లి గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి గంగుల కమలాకర్

# అండగా నిలిస్తే మరింత అభివృద్ధి చేస్తా



బీఆర్ఎస్‌లో చేరిన ఫోర్ వీలర్స్ మెకానిక్స్ అసోసియేషన్ నాయకులతో మంత్రి గంగుల, మేయర్ సునీల్‌రావు

- తెలంగాణ సంపదను దోచుకునే కుట్రలో ఆంధ్రా నాయకులు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్
- గంగులకు మద్దతు ప్రకటిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేసిన పలు సంఘాల నాయకులు

కార్పొరేషన్, నవంబర్ 1: ఈ ఎన్నికల్లో మరోసారి అండగా నిలిచి తనను గెలిపిస్తే నగరాన్ని మరింత అభివృద్ధి పథకంలోకి తీసుకెళ్తానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ హామీ ఇచ్చారు. బుధవారం స్థానిక పద్మనాయక కల్యాణ మండపంలో ఫోర్ వీలర్స్ మెకానిక్స్, ఇంజినీరింగ్ రీకండిషన్, డెంటింగ్, పెయింటింగ్, లేట్ వర్కింగ్ ఎలక్ట్రిషన్, కార్ డెకర్స్, కార్ కన్సల్టెన్సీ, ట్రాక్టర్ మెకానిక్స్ అసోసియేషన్, సామిల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆయా సంఘాల నాయకులంతా ఈ ఎన్నికల్లో కారు గుర్తుకే ఓటు వేసి, బీఆర్ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్‌ను గెలిపిస్తామని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల మాట్లాడుతూ, కాంగ్రెస్, బీజేపీలు ఢిల్లీ పార్టీలని పేర్కొన్నారు. వారికి ఓటు వేస్తే తెలంగాణ గుడ్డిదీపంగా మారుతుందన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. హ్యాట్రిక్ విజయాలను కట్టబెట్టిన కరీంనగర్ ప్రజల రుణం తీర్చుకునేందుకు శాయశక్తుల కృషి చేస్తున్నానని పేర్కొన్నారు. తెలంగాణ ఇప్పుడిప్పుడే అభివృద్ధిలో దూసుకుపోతున్నదని, మరోసారి దొంగల పాలు చేయవద్దన్నారు. మన తాతలు తప్పు చేస్తే 50 ఏళ్లు తెలంగాణ అరిగోస పడ్డదన్నారు. ఇప్పుడు అదే తప్పు మనం చేస్తే భవిష్యత్ తరాలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. నగరంలో పదేళ్లలో ఎంతో అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. కేబుల్ బ్రిడ్జి, మానేరు రివర్ ఫ్రంట్ ప్రాజెక్టులను తీసుకువచ్చామని, ఏడాదిలో మానేరు రివర్ ఫ్రంట్‌ను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో పూర్తి చేస్తామన్నారు. ప్రపంచ పర్యాటకులను ఆకర్షించే విధంగా చేపడుతున్న ఈ ప్రాజెక్టులతో యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. కాంగ్రెస్, బీజేపీ ముసుగులో ఆంధ్రా నాయకులంతా హైదరాబాద్‌లో అడ్డ వేసి హైదరాబాద్ సంపదను దోచుకునేందుకు కుట్రలు పన్నుతున్నారని దుయ్యబట్టారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించి తెలంగాణను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తనకు మరోసారి అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మేయర్ యాదగిరి సునీల్‌రావు, కార్పొరేటర్ ఐలేందర్, నాయకుడు మేచినేని అశోక్‌రావు, ఆయా సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**బీఆర్ఎస్‌లో చేరిక**

కొత్తపల్లి మండలం బద్దిపల్లి గ్రామానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్‌కు చెందిన పలువురు నాయకులు బుధవారం రాత్రి మంత్రి గంగుల కమలాకర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. చేరిన వారిలో రాచమల్ల శ్రీధర్, మల్లారెడ్డి, రాచమల్ల సతీశ్, అశోక్, అనిల్‌తో పాటు 30 మందికి పైగా యువకులు ఉన్నారు.

## 8 నుంచి బీఎస్సీ హానర్స్ పరీక్షలు

కమాన్‌చౌరస్తా, నవంబర్ 1: శాతవాహన యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ బీఎస్సీ హానర్స్ రెండో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 8, 9వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకోసం వేములవాడలోని దార్మిక డిగ్రీ కళాశాలను పరీక్ష కేంద్రంగా కేటాయించినట్లు తెలిపారు.

## భక్తి శ్రద్ధలతో సంకటహరచతుర్థి పూజలు

కమాన్‌చౌరస్తా, నవంబర్ 1: నగరంలోని ఆలయాల్లో బుధవారం సంకటహర చతుర్థి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భగత్‌నగర్‌లోని అంజనాద్రి లక్ష్మీగణపతి, జడ్పీ క్వార్టర్స్‌లోని అయ్యప్ప, రాంపూర్, గిద్దెపెరుమాండ్ల, కమాన్ రోడ్డు రామేశ్వరాలయం, అశోక్‌నగర్ వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయం, ప్రకాశంగంజ్‌లోని వరసిద్ధివినాయకస్వామి, పాత బజార్ గౌరీశంకర, చైతన్యపురి మహాశక్తి ఆలయాలతో పాటు ఇతర ఆలయాల్లో అభిషేక, అలంకార, అర్చనలు, హవనాలు నిర్వహించారు. ఆలయాల్లో భక్తులకు ఏర్పాట్లు చేశారు.

# శిక్షణతో వృత్తి నైపుణ్యాలు మెరుగు

ముకరంపుర, నవంబర్ 1: ప్రత్యేక శిక్షణ కార్యక్రమాల ద్వారా పశు వైద్యులు తమ వృత్తి నైపుణ్యాన్ని మరింత మెరుగు పరుచుకోవచ్చని ప్రాంతీయ పశు సంవర్ధక శిక్షణ కేంద్రం ఏడీ డాక్టర్ ఎన్ లింగారెడ్డి సూచించారు. కరీంనగర్ శివారు పద్మనగర్‌లోని ప్రాంతీయ పశు సంవర్ధక శిక్షణ కేంద్రంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పశు వైద్యులకు పాడి పశువుల్లో పునరుత్పత్తి వ్యవస్థ లోపాల పునరుద్ధరణ-నైపుణ్యాల పెంపొందించే అంశంపై నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని ప్రత్యేక బోధనా నిపుణుడు డాక్టర్ జీవీకే శర్మతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. పాడి పశువుల్లో పునరుత్పత్తి సమస్యలు పాడి రైతుల లాభనష్టాలను ప్రభావితం చేస్తాయని వివరించారు. క్షేత్రస్థాయిలో పనిచేసే పశు వైద్యులకు సాంకేతికంగా అవగాహన, పునరుత్పత్తి సమస్యలకు పరిష్కారాలను శిక్షణలో పూర్తిస్థాయిలో వివరించనున్నట్లు తెలిపారు. పది రోజులపాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. పాడి పశువుల పునరుత్పత్తి సమస్యలపై రాష్ట్రస్థాయిలో శిక్షణ ఇవ్వడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు వివరించారు. జిల్లాల వారీగా ఒక్కో బృందంలో 20 మంది పశు వైద్యులకు శిక్షణ ఇచ్చేలా ప్రణాళిక తయారు చేసినట్లు చెప్పారు. పది రోజుల్లో ఆరు రోజులపాటు తరగతి గది శిక్షణ, మూడు రోజుల పాటు క్షేత్ర స్థాయి శిక్షణ ఉంటుందన్నారు. ప్రత్యేక బోధనా నిపుణుడు డాక్టర్ ఎస్వీ రెడ్డి, కేంద్రం అధ్యాపకులు డాక్టర్ ఎం కోటేశ్వరరావు, డాక్టర్ సాయిచైతన్య, డాక్టర్ దివ్య, పాల్గొన్నారు.

## పోస్టర్ ఆవిష్కరణ

కార్పొరేషన్/కమాన్‌చౌరస్తా, నవంబర్ 1: జిల్లా కేంద్రంలోని పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో సిక్స్ అకాడమీ ఆధ్వర్యంలో 'నమస్తే కరీంనగర్' పేరిట బ్యూటీ అండ్ వెల్‌నెస్ సెమినార్, సర్టిఫికెట్ల ప్రదానోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకురాలు స్వప్నారావు పేర్కొన్నారు. ఈ మేరకు నగరంలోని క్యాంపు కార్యాలయంలో 'నమస్తే కరీంనగర్'కు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం మేయర్ సునీల్‌రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బ్యూటీషియన్ రంగంలో మహిళలు ఉపాధి పొందడానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని చెప్పారు. నిర్వాహకురాలు స్వప్నా రావును అభినందించారు. కాగా, ఆసక్తి గల మహిళలు ఉచిత పాస్‌ల కోసం సెల్ నంబర్ 90007 17199, 95053 33950లో సంప్రదించాలని స్వప్నా రావు సూచించారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మేయర్ సునీల్‌రావు, మహిళలు

## నేటి నుంచి జిల్లా సబ్ జూనియర్ ఖోఖో జట్లకు శిక్షణ

కొత్తపల్లి, నవంబర్ 1: జిల్లా సబ్ జూనియర్ ఖోఖో బాలబాలికల జట్లకు గురువారం నుంచి శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసినట్లు ఖోఖో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వై మహేందర్‌రావు తెలిపారు. ఇటీవల నిర్వహించిన ఉమ్మడి జిల్లా బాలబాలికల సబ్ జూనియర్ పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను బాల బాలికల జట్లకు ఎంపిక చేయగా వారికి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మానకొండూర్ మండలం దేవంపల్లిలోని టీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీలో బాలురకు, కరీంనగర్‌లోని పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాలలో బాలికల జట్టుకు శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బాలుర జట్టుకు కోచ్‌గా శివకుమార్, బాలికల జట్టుకు మధు వ్యవహరిస్తారన్నారు.

## జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు క్రీడాకారుల ఎంపిక

కొత్తపల్లి, నవంబర్ 1: గోవా రాష్ట్రంలోని పనాజీలో ఈనెల 4 నుంచి 8వ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు ఖోఖో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వై మహేందర్‌రావు తెలిపారు. పురుషుల జట్టుకు పెగడపల్లి మండలం నంచర్ల గ్రామానికి చెందిన నరేశ్, మంథనికి చెందిన నవీన్‌రాజ్ ఎంపికైనట్లు పేర్కొన్నారు. చీఫ్ కోచ్‌గా నరేశ్, అసిస్టెంట్ కోచ్‌గా ఆనంద్‌కుమార్ వ్యవహరిస్తారని చెప్పారు. కాగా, క్రీడాకారులను ఖోఖో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నటరాజ్ రవి, సంఘం సభ్యులు చిట్టి తిరుపతిరెడ్డి, మిల్కూరి సమ్మిరెడ్డి, సంపత్‌కుమార్, సూర్య ప్రకాశ్, రవీందర్, డాక్టర్ వేల్పుల కుమార్, ఎస్‌కే మొయినొద్దీన్ తదితరులు అభినందించారు.

## నాయబ్ తహసీల్దార్‌కు వినతి

కొత్తపల్లి, నవంబర్ 1: మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిపై హత్యాయత్నం చేసిన కాంగ్రెస్‌కు చెందిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు బుధవారం తహసీల్ కార్యాలయంలో నాయబ్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కాసారపు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు రాజు, చట్టు శ్రీనివాస్, పైడిపాల సతీశ్, సమ్మయ్య, పొన్నం మహిపాల్ తదితరులున్నారు.

## దంపతులకు దత్తత ఉత్తర్వు పత్రం అందజేత



దత్తత ఉత్తర్వు పత్రం అందజేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టరేట్, నవంబర్ 1: నగరంలోని శిశుగృహంలో పెరుగుతున్న చిన్నారిని దత్తత తీసుకున్న దంపతులకు బుధవారం కలెక్టర్ పమేలా సత్పతి ఉత్తర్వు పత్రం అందజేశారు. నల్గొండ జిల్లాకు చెందిన దంపతులకు పిల్లలు లేకపోవడంతో స్పెషలైజ్డ్ అడాప్షన్ ఏజెన్సీలో పిల్లల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరికి నగరంలోని శిశుగృహంలో గల ఏడాది వయసున్న పాపను గత నెలలో దత్తత ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి ఎం సరస్వతి, డీసీపీవో శాంత, ఐసీపీఎస్ సిబ్బంది తిరుపతి, తేజస్విని, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రసవాల నిర్వహణపై శిక్షణ

విద్యానగర్, నవంబర్ 1: హైరిస్క్ కేసులను గుర్తించి ప్రసవాల నిర్వహణపై శిక్షణను బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ లలితాదేవి నిర్వహించారు. పీహెచ్‌సీల పరిధిలో గర్భిణుల వివరాల నమోదు సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. వైద్యాధికారులకు, స్టాఫ్ నర్సులకు ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రాజగోపాల్‌రావు, శిక్షకురాలు డాక్టర్ ఇందు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రేకుర్తి కంటి దవాఖానలో మెరుగైన సేవలు

విద్యానగర్, నవంబర్ 1: లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ డాక్టర్ భాస్కర్ మడేకర్ చారిటబుల్ కంటి దవాఖానలో గత నెలలో 26 క్యాంపులు నిర్వహించి 2572 మందికి పరీక్షలు చేసినట్లు క్లబ్ చైర్మన్ కొండ వేణుమూర్తి తెలిపారు. 860 మందికి శస్త్ర చికిత్స చేయగా, ఇందులో 386 మందికి ఉచితంగా శస్త్ర చికిత్స చేసినట్లు పేర్కొన్నారు. దవాఖానలో మెరుగైన సేవలందిస్తున్నట్లు తెలిపారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో నలుగురికి జైలు

రాంనగర్, నవంబర్ 1: నగరంలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన పది మందిని కోర్టులో హాజరుపరచగా నలుగురికి జైలుశిక్ష, ఆరుగురికి జరిమానా విధించారు. సిరికొండ రమేశ్‌కు 5 రోజుల జైలు, రూ.1500 జరిమానా, మరో ముగ్గురికి మూడు రోజుల జైలు, రూ.5వేల చొప్పున జరిమానా విధించారు. మరో ఆరుగురికి జరిమానా రూపంలో రూ.12,500 చెల్లించాలని ఆదేశించారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కరీంనగర్ రూరల్, నవంబర్ 1: దుర్శేడ్‌లో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం సీఈవో వేణు ప్రారంభించారు. ఏఈవో పైడితల్లి, సింగిల్ విండో సిబ్బంది, హమాలీలు పాల్గొన్నారు.